# అతిపెద్ద వింత - మనిషే !

అసలు వింతను వదిలేసి మనవాళ్ళెందుకో ఏడు వింతల గురించి వింతగా చెప్పారు. హేంగింగ్ గార్డెన్స్, డయానా విగ్రహం వంటి ఆ పాత వింతలు చరిత్రలో కరిగిపోయాయి. దాంతో మరికొన్ని కొత్త వింతలు పుట్టుకొచ్చాయి. చైనా గోడ, తాజ్‌మహల్ వంటివి కొత్త వింతల్లో చోటు చేసుకున్నాయి.



అయితే, అన్నింటిలోనూ అసలు సిసలైన వింత - మనిషి! మానవ స్వభావాన్ని మించిన వింత మరొకటి లేదు.

మనిషి పగలబడి నవ్వనూ గలడు. విరగబడి నిప్పులు రువ్వనూ గలడు. కుమిలి కుమిలి కన్నీరు కార్చనూ గలడు. రగిలి రగిలి కన్నెర్ర చేయనూ గలడు. మాటల ఈటెలు విసరనూ గలడు. పాటల పూలను కురిపించనూ గలడు. వగల రాణివి నీవేనంటూ పొగడనూ గలడు. పగబడితే, ఎన్ని వగలు నేర్చావే అంటూ తెగడనూ గలడు. ప్రేమకోసం పరితపించనూ గలడు. ఆ ప్రేమనే దోమగా చూడనూ గలడు. నచ్చితే నెత్తిన పెట్టుకోనూ గలడు. నచ్చకపోతే కాలరాయనూ గలడు.

మనిషంటే ఒకటా రెండా, ఎన్ని వింతల పాలపుంతలు! ఎన్ని వింతల తనువు కంతలు!

సీతను రావణాసురుడు ఎత్తుకుపోతే, 'సీతా సీతా' అంటూ రాముడు తల్లడిల్లాడు. తన సీతను తను దక్కించుకోవడం కోసం రావణుడితో యుద్ధం చేశాడు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన సీతనే అగ్ని ప్రవేశం చెయ్యమన్నాడు. అదే సీతను అక్కున చేర్చుకున్న కొంత కాలానికే రాముడు అడవికి పంపాడు. దయార్ద్ర హృదయుడూ రాముడే. కఠినాత్ముడూ రాముడే. వీరాధివీరుడూ రాముడే. శోక సముద్రుడూ రాముడే.

వెన్న దొంగా కృష్ణుడే. కన్నె దొంగా కృష్ణుడే. పూతనను చంపిందీ కృష్ణుడే. గోవర్ధనగిరిని వేలితో ఎత్తిందీ కృష్ణుడే. రుక్మిణి మనసు దోచుకున్నదీ కృష్ణుడే. సత్యభామ కాలు పట్టుకుని తన్నించుకున్నదీ కృష్ణుడే. అర్జునుడిని శూరుడుగా ప్రశంసించిందీ కృష్ణుడే. 'చంపేదెవరు? చచ్చేదెవరు? అంతా నేనే' అని అర్జునుడిని నిమిత్తమాత్రుణ్ణి చేసిందీ కృష్ణుడే. కురుక్షేత్ర యుద్ధంలో ఆయుధం పట్టనన్నదీ కృష్ణుడే. ఒక ఆవేశ సందర్భంలో పట్టబోయిందీ కృష్ణుడే.

ధర్మ బుద్ధిగలవాడిగా అజాత శత్రువుగా పేరొంది జూదం ఆడిందీ ధర్మరాజే. ఆలిని ఓడిందీ ధర్మరాజే. 'అశ్వత్థామ హతఃకుంజర' అని అసత్యం ఆడిందీ ధర్మరాజే. తనెంతో అభిమానించే భీష్ముడి మరణ రహస్యం ఆయననే అడిగి తెలుసుకున్నదీ ధర్మరాజే. అభిమన్యుడికి పద్మవ్యూహంలోకి వెళ్ళడమే తప్ప రావడం తెలీదని తెలిసీ అతణ్ణి పంపిందీ ధర్మరాజే.

అభిమాన ధనుడిగా ఉంటూ పాండవుల మీద కక్ష కట్టిందీ దుర్యోధనుడే. కర్ణుడి మీద అభిమానం

చూపి, అతణ్ణి రాజును చేసిందీ దుర్యోధనుడే. నిండు సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం చేయించిందీ దుర్యోధనుడే. చదరంగం ఆడుతుండగా తన భార్య భానుమతి చీరకొంగును పట్టుకు లాగిన కర్ణుడిని క్రీడా స్ఫూర్తితో అర్థం చేసుకున్నదీ దుర్యోధనుడే. భీముడితో నిత్యం కయ్యానికి కాలుదువ్విందీ దుర్యోధనుడే. చివరికి, భీతితో కాసారంలో దాక్కున్నదీ దుర్యోధనుడే. రెచ్చగొడితే, బయటకొచ్చిందీ దుర్యోధనుడే.

యావత్ ప్రపంచాన్నీ ఏలాలని రెండో ప్రపంచయుద్ధాన్ని తెచ్చిందీ హిట్లరే. వేలాది ప్రాణాల్ని పోగొట్టిందీ హిట్లరే. చిట్టచివరికి పిరికిపందలా ఆత్మహత్య చేసుకున్నదీ హిట్లరే.

తనపై అత్యాచారం చేసిన వాళ్ళపై పగబట్టి దొంగల రాణిగా మారి ప్రతీకారం తీర్చుకున్నదీ పూలన్‌దేవే. లొంగిపోయి జైలుశిక్ష అనుభవించి, ప్రజాభిమానం పొంది, పార్లమెంటుకు ఎన్నికయ్యిందీ పూలన్‌దేవే. వీరంగాలు మాని, స్మగ్లర్ జీవితానికి స్వస్తి చెప్పి ప్రభుత్వానికి లొంగిపోయి సాధారణ జీవితం గడపమని గంధం స్మగ్లర్ వీరప్పన్‌కు సలహా ఇచ్చిందీ పూలన్‌దేవే.

తన తమ్ముణ్ణి చంపి, తన చెల్లెలిపై అత్యాచారం జరిపిన పోలీసుల మీద కత్తిగట్టి, అడవి దొంగగా మారిందీ వీరప్పనే. నూట ఇరవై మందికి పైగా పోలీసుల్నీ ఫారెస్ట్ ఉద్యోగుల్నీ చంపి కరడుగట్టిన హంతకుడయ్యిందీ వీరప్పనే. కర్నాటక, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలకు చిక్కకుండా పోలీసుల్ని మూడు చెరువుల నీళ్ళు తాగించిందీ వీరప్పనే. ఆ మధ్య అటవీ అధికారుల్ని బంధించి, తనకు క్షమాభిక్ష పెడితేనే వాళ్ళను వదిలి పెడతాననీ, లేకుంటే చంపుతాననీ ఆ రెండు రాష్ట్రాలనూ బ్లాక్‌మెయిల్ చేసిందీ వీరప్పనే. నక్కీరన్ పత్రిక సంపాదకుడు గోపాలన్ మధ్యవర్తిత్వంతో మానవతా దృష్టితో ఆ బందీలను విడిచిపెట్టిందీ వీరప్పనే. మళ్ళీ ఈ మధ్య ఆరుగురు ఫారెస్టు అధికారుల్ని బందీలుగా చేసుకుని తనకు క్షమాభిక్ష పెట్టమని తిరిగి కోరిందీ వీరప్పనే. జనజీవన స్రవంతిలో కలిసి పోదామని ఉందని చెప్పిందీ వీరప్పనే. బంధించిన ఆరుగుర్నీ ఎంతో దయగా చూసిందీ వీరప్పనే. తన డిమాండ్‌కు సరైన ప్రతిస్పందన ఆ రెండు ప్రభుత్వాల నుంచీ రాకపోయినా, ఆరుగుర్నీ విడుదల చేస్తూ, కౌగలించుకుని కన్నీరు కార్చిందీ వీరప్పనే. "మీ ప్రాంతానికి వచ్చినప్పుడు మిమ్మల్ని కలుసుకుంటాను. నాకు ఆతిథ్యం ఇస్తారు కదూ" అని అభిమానంగా బందీలను అడిగిందీ వీరప్పనే.

అవును, నిజం ..... ప్రపంచంలోకెల్లా అతి పెద్ద వింత - మనిషే సుమా!

●

24-10-97

వార్త దినపత్రిక